# ముగింపు మీరే చెప్పండి

సరదాగా టిక్కెట్ కొనుక్కొని గ్యాలరీలో కూర్చొని జీవితాన్ని పరీక్షిస్తూ, వినోద ప్రదర్శనాన్ని చూద్దామనుకున్నాడు, రామమూర్తి.

టిక్కెట్ కే లెక్క దొరకలేదు.

ఎంత నీరు పోసినా చిల్లికుండలా తయారైంది జీవనం.

ఆశని మాత్రం—అలా ధారగా, ఆధారంగా వొంచుతూనే వున్నాడు.

అందుకే—అతనికి క్షణ క్షణం—ఉత్సుకత.

అందుకే-అతనికి మరుక్షణం ఏదో జరుగుతుందనే—స్పష్టాస్పష్టమైన ఊహ. మినుకు మినుకుమనే అరుంధతీ నక్షత్రంలాంటి ఊహ.

అందుకే—రామ్మూర్తి తండ్రి—సుబ్బరాయుడు అతన్ని మేధకుడు అంటాడు.

తల్లి పిచ్చి మొద్దు—సాత్వికుడు అంటుంది.

అన్నయ్య శంకరం—పిరికి వెధవ అంటాడు.

తమ్ముడు శ్రీనివాసులు — "కొంతమంది కుర్ర వాళ్లు పుట్టుకతో వృద్ధులు" అని హమ్మింగ్ చేస్తూ, రామ్మూర్తి కళ్లల్లోకి చూస్తూ, నాలికతో వెక్కిరిస్తూ వుంటాడు. చెల్లెలు శారద 'ఓరి అమాయకుడా' అంటుంది.

అరుగు మీద కూర్చుని పెరట్లో సీతాఫలంచెట్టు మీద రామచిలుకను చూస్తున్నాడు—రామ్మూర్తి.

ఎండ కరకర మంటూ లేచింది.

సరిగ్గా అప్పుడు తండ్రి మాటలు వినిపించాయి— "తెల్లారి లేచినప్పట్నించీ ప్రతివాడికీ డబ్బుకావాలి. దొడ్లో నేనేమీ డబ్బుచెట్టుని మొలిపించలేదు. నే చావ లేను."

వంటింట్లో విసురుగా గిన్నెలు సవ్వడి చేస్తున్నై.

అంటే రాబోయే తుఫాను సంగతి తెలుస్తోంది— రామ్మూర్తికి.

వాతావరణం కలుషితం కాబోతోంది.

అంతలోనే — చెల్లెలు — శారద — అందుకుంది; "నేనేమీ మేక్సీలకీ, నైటీలకీ — ఇంట్లో మిక్సీలకీ

అడగటం లేదు. నాలుగు పుస్తకాలు కూడా లేకుండా ఏం చదువు చదవమంటారు. నాకు వద్దు మొర్రో అంటే—నాకు సుత్తికొట్టి—చేర్పించారు. "

శారద బి. యస్సీ చదువుతోంది. పుస్తకాలు కావాలి. ఈ పుస్తకాల్నెవరూ—హనుమాన్ చాలీసాల్లా; దేవునికృపల్లా-పంచిపెట్టరు మరి! డబ్బు కావాలి.

" ఈ సంసారం ఈది ఈది తలప్రాణం తోక కొస్తోంది. ఎటన్నా పారిపోయి సన్యాసుల్లో కలుస్తాను. " తండ్రి తన విసుగుదలని కొనసాగిస్తున్నాడు.

శ్రీనివాసులు—వోమూలనుంచీ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు, " అంత కష్టపడేవాళ్లు — మమ్మల్నీ భూమ్మీదికి తేకుండానే జాగ్రత్త పడక పోయారూ. "

అవును మరి, వాడూ ఈ ఏడే జూనియర్ కాలేజీ కొచ్చాడు. మాటలు నేర్చుకుంటున్నాడు.

" బాగానే బుద్ధి చెప్తున్నార్లే నాయనా. ఇక చాల్లే. త్వరగా తెమిలి ఎటు వాళ్లు అటు బయల్దేరండి. " కుక్కి మంచంలో తల్లి. ఆమెకి పక్షవాతం. ఇంటిపనంతా అందుకనే శారద మీద పడింది. శంకరం పెళ్లికాగానే వేరే కాపురం పెట్టేశాడు.

ఆ తర్వాత విసఖర్లేదు. రామ్మూర్తికి తెలుసు.

రోజూ వుండే భాగోతమే ఇది. ఆ వెంటనే—తల్లి—తన పుటకల నాటి జమీందారీనీ; పెళ్లినాటి వైభోగాన్నీ—ఆ గదిలో పరుస్తుంది. అసలే ఆ గది—ఇరుకూ, మురికీ. రెక్కలు ఊడిన కిటికీ, చవుడు పట్టిన గోడ, బావిదగ్గర్నుంచీ తేలి వచ్చే వాసనా—అన్నీ కలగలసి—మధ్యయుగాల మహాభాగ్యం మధ్య 'మనిషి' నికృష్టతని మాటల సవారీలో వూరేగిస్తాయి.

ఇక తండ్రి సరే సరి—

తన అకాల పదవీ విరమణకి కారణమైన ప్రభుత్వాన్ని శపిస్తూ, దేశ విదేశ రాజకీయ, ఆర్థిక సాంఘిక దురవస్థలపై అరగంటలోనే ఆరు వందల పుటల "థీసిస్"ని ఆశువుగా చెప్తాడు.

రామ్మూర్తికి విసుగూ, చిరాకూ కలిగాయి.

ఈ బాధలూ, గాధలూ—అరిగిపోయిన రికార్డయినై.

ఈ సంఘటనలూ, సంభవాలూ — చిరిగిపోయిన పైపంచెలయినై.

వాటిని వినలేడు,

వీటిని ధరించలేడు.

మనస్సు—తుప్పుపట్టిన నట్టులా తయారవుతోంది.

ఏం చేయాలో తెలీదు. ఎలా చేయాలో తెలీదు.

తిరిగే కాళ్లు తిరుగుతూనే వున్నై. వ్రాసే చేతులు అప్లికేషన్లు వ్రాస్తూనే వున్నై. ఆలోచనల పల్లకీలు ఆశల్ని మోస్తూనే వున్నై.

అయినా — కళ్లల్లో — పున్నమీ; పండు వెన్నెలా కనిపించడం లేదు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కాగితం అమావాస్య చీకట్లలో—నీడల్ని—వూడల్ని చేస్తోంది.

అరుగు మీద నుంచీ లేచి — వేపచెట్టు క్రిందికి చేరాడు. అక్కడ—తాతలనాడు నగిషీలు చెక్కించుకుని; గారాలుకులికించుకుని; ఆ కాలం వారి సరసాల్నీ, సరదాల్నీ, విలాసాల్నీ—వినీ, కనీ, కడుపులో దాచుకునీ—అనుభవం గడించిన—రంగూన్ టేకు చెక్క మంచం వుంది.

రామ్మూర్తికి దాని మీద పడుకుని, ఆకాశంలో మబ్బులు కల్పించే బొమ్మల్ని చూస్తూ, తాత ముత్తాతల ఐశ్వర్య భోగభాగ్యాల్ని గురించి రకరకాల ఊహల్ని ఊహిస్తూ—మనసుని తేలిక పరచుకోవడం—అలవాటు.

మంచం మీద నడుం వాల్చాడు, రామ్మూర్తి. వెల్లకిలా పడుకుని కాళ్లు విరుచుకునేసరికీ — కడుపులో

పేగులు ఉండలు చుట్టుకుంటున్నట్లయింది. రాత్రి తిన్న శనివారం ఇడ్లీ; ఉదయం తాగిన నీళ్ల కాఫీ—ఏ మూలనో ఇగిరి, ఇంకిపోయినట్లనిపించింది. నెమ్మదిగా పక్కకి వత్తిగిలి పడుకున్నాడు.

శిథిలమైన కోటగోడలా ప్రహరీగోడ. దానిమీద బండ రాళ్ల మధ్యనుంచీ—వేళ్లు తన్నుకుని ఆకాశానికి దారులు వెతుక్కుంటున్న రావిచెట్లు. అక్కడోటీ, ఇక్కడోటీ వేప మొక్కలు. ఆ మధ్యగా ఒకటి రెండు జిల్లేళ్లు. పెరటి గుమ్మం మీద పడి మొలిచిన గరికపూల మొక్కలు.

రామ్మూర్తికి ఏదో సినిమా పాట గుర్తుకొచ్చింది—

" కాగితంపు పూవుకన్న గరికపూవు మేలు "

అవును. ఆ సినిమా తను రాఘవరావ్‌తో కలిసి చూశాడు. ఆలోచనలు రాఘవరావ్ మీదికి మళ్లినై. రాఘవ రావ్‌తో ఐదేళ్ల స్నేహం తనది.

వెండిచెంచా నోట్లో పెట్టుకుని పుట్టినవాడు—రాఘవ. తండ్రి పెద్ద గని వోనరు, బిజినెస్ మాగ్నెట్.

తండ్రి హోదా, ఐశ్వర్యం—రాఘవరావ్‌ని శ్రమ అంటే ఏవిటో తెలీకుండా పెంచినై. కాలేజీ రోజుల్ని మూడు పూలూ—ఆరు కాయలుగా పుష్పించి, పండించి—మూడో తరగతిలో బయట పడ్డాడు. ఆ వెంటనే యూనివర్సిటీలో—

అన్నిటా తానుగా అంతటా తానుగా — వెలిగిపోయాడు. చుట్టూ పరివారం. ఒక జేబులో నోట్ల కట్టలు, మరో జేబులో— మొత్తం యూనివర్సిటీ, ఏంవిటి, యూనివర్స్‌నే పెట్టుకు తిరిగాడు. ఏ మాట కామాటీ చెప్పుకోవాలి.

తన పేదరికం—రాఘవ స్నేహానికి అడ్డం రాలేదు.

అయితే తన లేమి—అడపాదడపా—తన మనసు నొప్పించే సంఘటనలకి కారణమయ్యేది.

ఒకసారి — రాఘవా, తనూ మిత్రులూ కలిసి — అంతా వో పదిమంది — సినిమాకి బయల్దేరారు. చంద్రం కాబోలు జోక్ చేశాడు — సినిమాహాల్ దగ్గర.

" టిక్కెట్ కోసం, పొరపాటున నువ్ మాత్రం పాంట్ జేబులోకి చేతులు పోనీకురోయ్. ఆ పాకెట్‌కి చిల్లులుంటయ్. అనక ప్రమాదం " అని.

అంతా గొల్లున నవ్వారు. ఆ రాత్రి తనకు నిజంగా నిద్ర లేదు.

పది పదిహేను రోజులకి కానీ తాను మామూలు మనిషి కాలేకపోయాడు. అదీ—రాఘవరావ్ బలవంతానా; చంద్రం 'సారీ' చెప్పటంవలనా.

ఎమ్మే అయి—వీధుల్ని సర్వే చేస్తుండగా — వో ఆలోచన వచ్చింది.

అవును. వెళ్లి రాఘవరావ్‌ని కలిశాడు. తనని చాలా ఆప్యాయంగా ఆహ్వానించాడు రాఘవ. వాళ్ల బంగళా అంతా చూపించాడు. ఎర్రటితివాచీలు పరచి, అద్దాల బీరువాలు నిండిన గదులు; అందమైన షోకేస్‌లూ, ప్రతి రూమ్‌లోనూ డ్రెస్సింగ్ టేబుల్స్, డబుల్ కాట్‌లూ, ఏ సీ. యూనిట్లూ; వీటన్నిటితోపాటు తన వదినల్ని ముగ్గుర్నీ; తన చెల్లెళ్లు ఇద్దర్నీ కూడా చూపించాడు. అందం వొక్క చోటే ముద్దగట్టినట్లున్న ముద్దరాళ్లు! కూల్ డ్రింకు ముందు వాళ్ల నాన్ననీ పరిచయం చేశాడు. ఆయనా — దొరగారిలా వున్నాడు. ఆయన తన వ్యాపారంలో ఇబ్బందుల్ని గురించీ, రాజకీయాలు తెస్తున్న బాధల్ని గురించీ ఏవేవో చెప్పాడు.

చల్లకొచ్చి ముంత దాచినట్లైంది తన పరిస్థితి. అభిమానం అడ్డొచ్చింది. ఏవీ అడగలేకపోయాడు.

"ఊరికే చూసి పోదామని వచ్చాను" అని చెప్పి వచ్చేశాడు.

ఆ వాతావరణంలో వున్నంతసేపూ — "నా దేశం పేదదేశమా" అనే విచికిత్సలో పడిన తాను — బయటికి రాగానే, మండుటెండలో స్టేషన్‌కి నడిచొచ్చేసరికీ — తన దేశం ఏవిటో తన ప్రజలు ఎవరో తెలిసొచ్చింది.

మనసంతా గచ్చపొదలా మారిపోయింది.

ఆ తర్వాత—రాఘవకి ఉత్తరం వ్రాస్తే—మూడో నాటికే జవాబు వచ్చింది. "సారీ" అనే పదం మూడు సార్లు వాడాడు—రాఘవ—ఆ ఉత్తరంలో.

మరో ఏడాది గడిచే సరికి నిరుద్యోగం ఎంత దారుణమైనదో—అనుభవంలో కొచ్చింది. చేదు నిజాల్ని మింగలేక, మింగిన వాటిని జీర్ణం చేసుకోలేక—జలోదర వ్యాధిగ్రస్తుడులా తయారయ్యాడు.

అందుకే,

మళ్లీమళ్లీ పాట గుర్తుకొస్తోంది—రామ్మూర్తికి. సన్నగా పాడుకున్నాడు—'కాగితంపు పూవుకన్న గరిక పూవు మేలు'.

ఆ వెంటనే పల్లవీ నోటి వెంట వచ్చేసింది; 'చదువు రానివాడవనీ దిగులు చెందకూ....' అని.

కానీ, తాను చదువు రానివాడు కాదే—అదీ బాధ.

చదువురానివాడైతే రాళ్లు కొట్టేవాడు; ఎక్కడో రిక్షా తొక్కుకునేవాడు; లేదా మూటలు మోసేవాడు; లేదా పలుగూపారా పుచ్చుకొనేవాడు, లేదా కోతలు కోసేవాడు, లేదా తాపీ పని నేర్చుకొనేవాడు.

ఏం—ఇవన్నీ చదువుకున్నవాడు చెయ్యకూడదా.

ఏమో—తెలీదు.

తాను చెయ్యాలని అనుకోలేదు—అంతే.

అసలు కారణం అదిగాదు. తన "అహం" తనని ఈ పనుల్ని చేయనీయడం లేదు. ఛ. ఛ. పాడు ఆలోచనలు!

తన మీద తనకే చిరాకేసింది—రామ్మూర్తికి.

మనసు పరిపరి విధాల పోతున్నది.

మేధస్సు ఆలోచనలతో గిరికీలు కొడుతోంది.

అలా....అలా....ఎన్నో....ఎన్నెన్నో...ఆలోచనలు!

♦ ♦ ♦

వంద హెక్టార్ల ఆవరణ. జనం. జనం. జనం.

నేల ఈనినట్లూ, మహాసముద్రం పొంగినట్లూ, ఇసుక వేస్తే రాలనంత జనం.

ఇటు చూస్తే జనం. అటు చూస్తే జనం! ఎటుచూస్తే అటుజనం! రంగు రంగుల వాళ్లు రాగి మీసాలవాళ్లు! తల పాగాలవాళ్లు; టోపీలవాళ్లు! అడ్డపంచెలవాళ్లు; పంచెలవాళ్లు! సూటువాలాలు, పాంటూళ్లాకులవాళ్లు!

వయసు మళ్లిన వాళ్లు, వయసు తీరిన వాళ్లు!

వయసు మీద వున్నవాళ్లు; వచ్చీరాని వయసువాళ్లు!

యువకులు; యువతులు; ప్రౌఢలు, వృద్ధులు!

వీరందరికి మధ్యగా ఎక్కడో సుదూరంగా వేదిక. ఆవరణ ఆవరణంతాకోలాహలం, డప్పులవాళ్లు, చిరుతలవాళ్లు,

భజన సంఘాలు! బుర్ర కథలు, హరికథలు, పిట్టకథలు, పిటపిటలకథలు, చిటపటలకథలు జరిగిపోతున్నై. కుస్తీలు, బస్కీలు, మల్ల యుద్ధాలు, కబాడీలు; ఎడ్లపందేలు— ఒకటేమిటి ఎటుచూస్తే అటు – ఏదో వొక వినోద ప్రదర్శన! ఇక అంగళ్ల సంగతి చెప్పేదానికే కాదు; వో పక్కన నాటకశాల. పౌరాణిక నాటకాల్లో పద్యాలు పేలుతున్నై; రాగాలాపన— ప్రేలాపన—అలాపనలు తూలుతున్నై!

రామ్మూర్తికి తల తిరిగిపోతోంది. తిరుగుతున్నాడు; తిరగలేకపోతున్నాడు! తన ప్రమేయం లేకుండా ఎవరెవరో ఏమిటేమిటో చేస్తున్నారు—మంత్ర జలం చల్లినట్టు— తనని తెప్పలమీద తేలిస్తూ, ముందుకూ మున్ముందుకు తీసుకుపోతున్నారు. అయితే, వొళ్లు హూనం హూనం అయిపోతున్నది. ఇటొక పోటు, అటొక వేటుగా వుంది. "ఎందుకు వచ్చాన్రా బాబూ ఈ మేళాకి?" అనిపించింది. ఆ ప్రశ్నకు బదులుగా వెనుకనుంచీ వొక—'జిందాబాద్— జైజై'—ల మధ్య తోపిడి జరిగింది. తాను కిలోమీటరు అవతలపడ్డాడు. 'అబ్బా....అమ్మా' అనుకున్నాడు. తనతోపాటు ఇంకా చాలామంది అవే పదాలు అన్నట్లు విన్నాడు.

పాదం మోపి—పక్కన పందిరి గుంజను గట్టిగా ఒక చేత్తో పట్టుకుని నిలదొక్కుకున్నాడు.

అప్పుడు చుట్టూ చూస్తే — దగ్గర్లో — వేలవేల సంఖ్యలో లారీలు, ఎడ్లబండ్లు, రిక్షాలు, టాక్సీలు, కార్లు, ఆటోలు కనిపించాయి. పిల్లవాడు కోపం కొద్దీ విసిరి పారేసిన గోలీకాయల్లా—

క్షణంలో సగంసేపు—

అంతే—

మళ్లీ జయజయధ్వానాలు, జిందాబాద్ నాదాలు.

వేదికవైపుకు తండోపతండాలుగా జన ప్రవాహం సాగిపోతోంది.

భూనభోంతరాలు దద్దరిల్లుతున్నై.

దిక్కులు పిక్కటిల్లిపోతున్నై.

ప్రముఖ వ్యక్తులు, ప్రప్రముఖ వ్యక్తులు కదుల్తున్నారు. నాయకులకు దారిచేస్తూ బారులు తీరుస్తున్న వలంటీరులు, బరాబరులు చేస్తున్న ఛోటానాయక వీరులు, పిడికిలి బిగించి నినాదాలిస్తున్న రేపటి వీరకుమారులు!

వేదికమీద చలనం, సంచలనం కలుగుతోంది:

రామ్మూర్తికి ఈ చోటు బాగా అమరింది. ఇక్కణ్ణుంచీ అంతా చక్కగా కనిపిస్తోంది. ఉత్సుకతతో చూస్తున్నది ప్రజ. ఉత్సాహంతో ఈలలూ, గోలలూ చేస్తున్నది—ప్రజాభిమానం!

ఉన్నట్టుండి, రామ్మూర్తికి ఒక చిత్రమైన ఆలోచన వచ్చింది.

చిన్నప్పుడెప్పుడో – తొలిసారి – తాతయ్య తనని ఎగ్జిబిషన్‌కి తీసుకుపోయాడు. అక్కడి వింతలూ, విశేషాలూ, అంగళ్ళూ చూసి కళ్ళు చెదరిపోయినై తనకు. మిఠాయి తినిపించాడు, తాతయ్య. అప్పుడు తనో ప్రశ్న వేశాడు. "ఇది పెట్టటానికి ఎంత ఖర్చయి వుంటుంది, తాతయ్యా ?" అని. ఆయన నవ్వి, "లక్షల్లో వుంటుందిరా—మాటలా !" అని ఆశ్చర్యంగా తనకేసి చూశాడు. తను మరింత ఆశ్చర్యపోయి నోరు వెళ్ళబెట్టాడు. దాని దృష్ట్యా చూస్తే, ఈ మహా మహా మహా సభలకి ఎంత ఖర్చవుతున్నదో ! కుంటి ప్రశ్న ! తనని తానే నిందించుకున్నాడు అప్రయత్నంగా—జేబులోకి పోయింది చెయ్యి.

ఐదు రూపాయల కాగితం తగులుతోంది.

మైకు మోగింది. జనం సద్దుమణగసాగింది.

నాయకులు మొదలెట్టారు—ప్రసంగాలు.

చప్పట్లు, తప్పట్లు—కాకుంటే కరతాళధ్వనులు. ఉపన్యాసాలు సాగిపోతున్నై. అరే, మహానాయకుడి ప్రక్కగా—ఆc. అవును. అతనే—అతను రాఘవరావే. అవును. రాఘవరావే ! ఆశ్చర్యపోయాడు—రామ్మూర్తి.

మహానాయకుడు లేచాడు.

జనంలో కలకలం. కంఠనాళాలు తెగిపోయేటట్లు జై జై ధ్వానాలు ; గళాలు పెకల్చుకుని వచ్చిన 'జిందాబాద్' నినాదాలు.

చిరుదరహాసంతో, ముకుళిత హస్తాలతో, వినయ వినమ్రతతో తలపంకించి మొదలెట్టారు.

కృతజ్ఞతలూ, శుభాకాంక్షలూ, అభినందనలూ ! ఆ వెంట వెంటనే—ఎక్కడ అభివృద్ధి అని వేల వేల ప్రశ్నలు ! ఆ తర్వాత హామీలు, వాగ్దానాలు.

ఆఁ. అదుగో, ఆగేరు. గొంతు సరిచేసుకున్నారు. బిగ్గరగా చెప్పసాగేరు. చేయెత్తి, గుప్పిటనిండా అభయాన్ని బిగబట్టి చెప్తున్నారు.

" యువతలో అశాంతి రగులుకోవడం—మన స్వాతంత్ర్యానికే మంచిది కాదు. అందుకే—చాలా రాత్రులు నిద్రలేకుండా ఆలోచించాను. ఆవేదన చెందాను. ఒక నిర్ణయానికి వచ్చాను. ఇప్పుడే, ఇక్కడే ప్రకటిస్తున్నాను. ఈ క్షణంనుంచీ—నిరుద్యోగులందరికీ నెలకు వెయ్యిరూపాయల ఉచిత జీవనభృతిని మంజూరు చేస్తున్నాం".

ప్రజల జయజయధ్వానాలతో ఆకాశం దద్దరిల్లిపోయింది.

చేతులతోనే అందర్నీ శాంతింపజేసి చెప్పసాగేరు.

"అలాగే, గాలీ నీరూ ప్రకృతి మనకు ప్రసాదించిన వరాలు. వీటిలో—నీరు ఏదీ? అందరికీ లభించడం లేదు. మీకు తెలుసు. గ్రామాలకి గ్రామాలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నై. అందుకే—అన్నీ ఆలోచించి—ఒక నిశ్చయానికి వచ్చాం. ప్రతి పల్లెకీ నాలుగు బోర్‌ల చొప్పున మంజూరు చేస్తున్నాం. ఈ సంవత్సరాంతానికి తాగడానికి నీరు దొరకని గ్రామం వుండకూడదని శపథం తీసుకున్నాం, వుండదని మీకు హామీ నిస్తున్నాం".

♦ ♦ ♦

ఏదో రంగురంగుల చక్రాలు....వలయాలు....

ఏవేవో రంగురంగుల పిట్టలు ఆకాశంలో పల్లటీలు కొడుతున్నై.

చెవుల్లో అవే, అవే మాటలు రింగుమని మారుమ్రోగుతున్నై.

"ఆఁ....ఆఁ....నెలకు వెయ్యిరూపాయలు....వెయ్యి రూపాయలు" అంటూ వులిక్కిపడి, లేచి, గావుకేకలు పెడుతూ—నోరు తెరిచి; "నీళ్ళొచ్చినై....మా వూరికి నీళ్ళొచ్చినై" అని చప్పట్లు కొడుతూ, శివాలూ చిందులూ వేయసాగేడు—రామ్మూర్తి. వెనక వసారాలో మిషన్ కుట్టుకుంటున్న శారద 'అన్నకి పిచ్చెక్కిందా'ని హడలి

పోయింది. బిక్కమొహం వేసుకుని అప్రతిభురాలై కూర్చుండిపోయింది. మంచంలో తల్లి—ఏం జరిగిందో తెలీక—అవాక్కయిపోయింది.

క్షణాల తర్వాత—తెప్పరిల్లుకుని, లేచి, నెమ్మదిగా కదిలింది – శారద. అన్నదాకా నడిచింది. "ఏఁవిటన్నయ్యా?" అని జబ్బని వొడిసి పట్టుకుని కుదిపింది.

"పిచ్చి మొద్దు. పగటి కలేదో కన్నట్టున్నాడు. వోసారి భుజం చరుచు శారదా; సర్దుకుంటాడు" అంటోంది, తల్లి.

"ఏఁవిటన్నయ్యా....ఏం జరిగింది?" చెయ్యి పట్టుకుని కదిలిస్తూ మళ్ళీ అడిగింది శారద.

"ఆఁ....ఆఁ...." అంటూ స్పృహలో కొచ్చాడు రామ్మూర్తి. కళ్ళు నులుముకుని ఎదురుగా చూశాడు. చెల్లెలు శారద! చుట్టూ చూశాడు. వేపచెట్టుకింద చెక్క మంచంమీదే వున్నాడు తను. కళ్ళముందు లీలగా ఏవేవో రంగుల కలలు అంతే!

అప్పుడే లోపలికొచ్చిన పక్కింటి రాధమ్మ—"ఎందుకైనా మంచిది—రక్ష కట్టించు వదినా—మూడేళ్ళ నుంచీ మరీ ఏ వుద్యోగం లేకుండా కూర్చోవడమాయె." అని సలహా యిచ్చి, "శారదా; ఓ చెంబుతోనన్నా కాసిన్ని తాగే నీళ్ళియ్యమ్మా" అని శారదని పిలిచింది.

రాత్రి దొరికిన బిందెడు నీళ్ళల్లో చెంబుడు పోతాయే అనే గుబులుతో భారంగా ఇంట్లోకి నడిచింది శారద.

చెల్లెలివైపు చూస్తూ, రాధమ్మ మాటల్ని మననం చేసుకోసాగేడు—రామ్మూర్తి.

గాలి స్తంభించింది.

'నన్ను మాత్రం ఏ సాక్ష్యమూ, ఏ వివరమూ అడగకు బాబూ—నువ్ వేసేవన్నీ జవాబులేని ప్రశ్నలే' అని మౌనం వహించింది, వేపచెట్టు.

అప్పటికప్పుడే—సూర్యుడు—తారాలూ, మిరియాలూ నూరుతూ, పైపైకొచ్చేశాడు!!